# నన్ను క్షమించవ్వా!

ఎమ్. ఉమాలక్ష్మి



ప్రశాంతంగా ఉన్న ప్రకృతి అరనిమిషంలో గందరగోళంగా తయారయ్యింది. గట్టిగా వీస్తున్న గాలికి కిటికీ రెక్కలు టపటపమని కొట్టుకొంటున్నాయి. అంతలోనే గాలి ఆగిపోయి పెద్ద పెద్ద చినుకులు పడసాగాయి. క్రమ క్రమంగా వర్షం జోరు హెచ్చింది. ఇంటి కప్పుల మీద నుండి వర్షం ధారలుగా పడుతోంది. గాలి వీస్తున్నప్పుడల్లా కిటికీలోంచి జల్లు కొడుతోంది.

కిటికీకి కొంచెం దూరంలోనే పడుకున్న సావిత్రి కొద్దిగా కదిలింది. కుడి చేత్తో కిటికీ రెక్క వెయ్యబోయింది. కాని అందలేదు. ప్రక్కకు తిరిగి చూసింది. గాఢ నిద్రలో మునిగిఉన్న కూతురిని లేపాలనిపించక మౌనంగా ఊరుకుంది.

ఎప్పుడూ చీమ చిటుక్కుమంటే నిద్రలేచే రమ్య, ఈ రోజు ఇంత గాలి వర్షం వస్తున్నా నిద్రపోతుందేమిటి?

సావిత్రి ఆలోచనలు రమ్య మీదికి మళ్ళాయి.

పగలంతా ఇంటిపనితోనూ, తన సేవలతోనూ అలసిపోయిన రమ్యకి నిద్రపోవడానికి టైం ఎక్కడిది? రాత్రి పదకొండు గంటలయితే గాని, ఈ ఇంటి పని ఒక కొలిక్కి రాదు.

"రమ్యా! నిన్ను నేను సుఖపెట్టలేక పోయానమ్మా! పైగా ఏ తల్లి ప్రవర్తించనంత కఠినంగా ప్రవర్తించాను. మూర్ఖంగా నిన్ను శాసించాను. అందుకే.. అందుకే ఇప్పుడిలా అనుభవిస్తున్నాను' అస్పష్టంగా గొణుక్కుంది. పశ్చాత్తాపంతో ఆమె హృదయం దహించుకు పోతుంది. కళ్ళల్లో సన్నటి కన్నీటి పొర కదలాడింది.

ఆ రోజుల్లో తను ఎంత అహంభావంగా ప్రవర్తించేది? మరచిపోదామన్నా ఆనాటి సంఘటనలు మరుపురావు.

ఈ జబ్బు వచ్చిన దగ్గరనుండి, ఈ జ్ఞాప కాలు తనని మరింత వేధిస్తున్నాయి. గతం తలుచుకుంటే ఒక్కొక్కసారి తృప్తిగా ఉంటుంది. ఎప్పుడూ తన గతం తనే తలుచుకుని ఆనందపడేది. గతంలో మధురస్మృతులు తనని మురిపించి మరి పించేవి. కానీ రమ్య గతం....రమ్య గురించి తనెప్పుడైనా ఆలోచించిందా!

సావిత్రి ఆలోచనలు గతంవైపు పరుగుతీసాయి.

* * *

రమ్య తనకి లేకలేక పుట్టిన ఆడపిల్ల. తను ఆడదై పుట్టినా, మొదటి నుండి తనకి ఆడపిల్లలంటే ఇష్టం ఉండేదికాదు. కానీ వారికి ఆడపిల్ల కావాలనే తపన ఉండేది. తన ఇష్టాన్ని తీర్చినట్లు, ఆ దేవుడు తనకి నలుగురు మగబిడ్డల్ని ప్రసాదించాడు అప్పుడు తను ఆపరేషను చేయించుకుంటానని పోరింది. కానీ తన కోరిక తీర్చమని వారు ప్రాధేయ పడడంతో తను వెనక్కి తగ్గింది.

ఆయనకి ఎప్పుడూ తనని శాసించే అలవాటు లేదు తనకి కావల్సిందేదో నోరు తెరచి అడిగేవారు కాదు. తనే ఆయనకి ఏ వేళలో ఏంకావాలో జాగ్ర త్తగా చూసి పెడుతుండేది. ఆయన నోరు విప్పి తనని అడిగిన మాట ఇదొక్కటే! కాదనలేకపోయాను.

ఫలితంగా అయిదో కాన్పులో ఆడ పిల్ల పుట్టింది ఆయన ఇష్టప్రకారమే కూతురిని 'రమ్య' అని పిలుచుకున్నారు. రమ్యకి అతి వైభవంగా, అట్టహాసంగా బారసాల చెయ్యాలని ఎంతగానో అను కుందేవారు

కానీ జ గిందేమిటి!.... ఆ రోజే.... సరిగ్గా ఆ రోజే .... ఆయనకి ఫోన్ వచ్చింది. బిజినెస్‌లో పెద్దపెట్టున నష్టం వచ్చింది. అంతే చెట్టంత మనిషి కుప్పలా కూలిపోయారు. హార్ట్ఎటాక్ వచ్చింది. అతి ఆర్భాటంగా చేద్దామనుకున్న బార సాల, విచారంతో ముగిసింది.

అప్పుడే తను మొట్టమొదటిసారి రమ్యను చీదరించుకుంది. కళ్ళైనా తెర వని పసిగుడ్డుమీద అసహ్యాన్ని పెంచు కుందా క్షణంలోనే!

ఒక నెలరోజులు గడిచిపోయాయి. ఆయన ఆరోగ్యం కొత్త కుదటపడ్డది. కానీ మనిషి బాగా డీలా పడిపోయారు.

ఆరోజు ఓపిక తెచ్చుకొని, ఉయ్యాల్లో ఉన్న రమ్యను ముద్దు పెట్టుకున్నారు. ఆయన ముఖంలో ఏదో ఆనందం. రమ్యని రెండు చేతులతో ఎత్తి, బయటకు తీసారు

ఆ దృశ్యాన్ని చూసి, తల్లిగా ఆనం దించ వలసిన నా మనస్సెందుకో భగ్గుమంది.

'ఈ దౌర్భాగ్యురాలు పుట్టింది. మనకి కష్టాలని తెచ్చిపెట్టింది.' అంది ఏడుపు గొంతుతో.'



అంతే; ఆయన 'సావిత్రీ' అని గట్టిగా అరిచారు. కోపంతో ముఖం ఎఱ్ఱబడింది. పచ్చిబాలింతరాలైన నన్నేమీ చెయ్యలేక, ఎత్తిన చెయ్యి దింపేసి, "ఇంకెప్పుడూ రమ్యని ఒక్కమాట అన్నా భరించలేను." ఆవేదనగా అని అక్కడ నిలబడడం ఇష్టంలేనట్లు వెళ్ళిపోయారు.

పెద్దబాబు రమేష్ పుట్టినప్పుడు చిన్న టీకొట్టు కాస్తా పెద్దదయింది. రెండోవాడు కిషోర్ పుట్టేక అది హోటల్‌గా మారింది. ఆ హోటల్ మరింత అభివృద్ధి చెందడంతో, వ్యాపారం మొదలుపెట్టేడు. మూడోవాడు రత్నాకర్ పుట్టాక వ్యాపారం వర్ధిల్లడంతో డబ్బు బాగా వెనకెయ్య

గలిగాడు. నాల్గోవాడు నిరంజన్ పుట్టే సరికి, ఆయన స్నేహితుడు జగన్నాధం గారితో కలిసి పెద్ద బిజినెస్ పెట్టారు ఆ బిజినెస్‌లో ఇంతవరకు లాభాలే గాని నష్టాలు లేవు దాంతో ఇద్దరూ కలిసి ఒక కంపెనీ పెట్టారు కొంతకాలం జగన్నాధంతోకలిసి వ్యాపారం చేశారు జగన్నాధం ఫారెన్ వెళ్ళిపోవడంతో, కంపెనీ అంతా ఈయన పేరుతోనే ట్రాన్స్ఫర్ అయ్యింది

ఏ సంవత్సరమూ నష్టమనేది తెలియకుండా నడిచిపోయిన కంపెనీకి, ఇప్పుడు పెద్దపెట్టున నష్టం వచ్చింది ఇద తాదీవి అదృష్టం కాకపోతే మరెవరి దనుకోవాలి? ఒక్కసారి పది లక్షలు నష్టం ఆలోచిస్తూ ఒశాంతిగా కళ్ళుమూసుకుంది

రమ్య క్యార్, క్యార్‌మని ఏడుస్తుండడంతో చికాకుగా చూసింది ఆ చిన్ని చిన్ని కళ్ళు నీళ్ళతో నిండాయి అమ్మా! ఆకలి ఆకలి అంటున్నట్లుందా ఏడుపు ఆ ఏడుపుకి ఆమె మాతృహృదయం కరిగిపోయింది పాపను దగ్గరకు తీసుకొని పాలుపట్టసాగింది అంతవరకూ హృదయ విదారకంగాఏడ్చిన ఏడుపు ఆగిపోయింది. తల్లి వక్షంలో తలదూర్చి, తన ఆకలి తీర్చుకుంటుందా పసికందు

ఓడలు బళ్ళు అవుతాయి బళ్ళు ఓడలు అవుతాయి అన్నట్లుగా ధనుంజయరావు గారి సంపద క్రమక్రమంగా తగ్గిపోసాగింది ప్రతి సంవత్సరం నష్టాలతో నడుస్తున్న కంపెనీ ఇంక నడపలేక అమ్మేశాడు రమ్యకి అప్పటికి అయిదేళ్ళు వచ్చాయి

ఇంటి పరిస్థితులన్నీ తారుమారైపోవడంతో, ధనుంజయరావు మానసికంగా కృంగిపోయాడు చేతికి అందివచ్చిన కొడుకులు లేరు రమేష్‌కి నిండా పదిహేనేళ్ళు లేవు కొడుకుల్ని బాగా చదివించి, పెద్ద ఉద్యోగస్తులని చెయ్యాలని ఎన్ని కలలు కన్నాడు ఆ కలలన్నీ తన కళ్ళముందే కరిగిపోతున్నాయి.

దానికి తోడు రమ్యపట్ల సావిత్రి ప్రవర్తన మరీ అసహ్యం కలిగిస్తోంది ఏ ఆడపిల్లకోసం తను తపించిపోయాడో ఆ ఆడపిల్ల పుట్టేసరికి, సిరిసంపదలన్నీ తొలగిపోయాయి రమ్య ఈ ఇంట లక్ష్మీదేవిలా కళకళలాడుతూ తిరగాలని కలలు కన్నాడు కానీ కానీ తన ఆశలని అడియాసలుచేసి తనని ఓడిస్తోందివిధి.

రమ్యకి ఐదోఏడు వచ్చింది ఆ రోజు రమ్యకి అక్షరాభ్యాసం చెయ్యాలని అనుకున్నారు. ఆయన కావలసిన సామాన్లు కొనడానికి బజారుకి వెళ్ళారు

అంతే! అతడు మరి తిరిగిరాలేదు. లారీ యాక్సిడెంట్‌లో, అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. భర్త పోయిన దుఃఖం ఒకవైపు, దీని కంతటికీ కారణం రమ్యేనన్న ఊహ ఒకవైపు సావిత్రిని చిత్రవధ చేస్తున్నాయి.

"అమ్మా నేనీరోజు బడికి వెళ్తానటగా! మరి డాడీ ఇంకా రాలేదేం? వన్నెవరు బడికి తీసుకెళ్తారు?" అమాయకంగా అడుగుతున్న రమ్యని విసురుగా త్రోసేసింది దాంతో రమ్య క్రిందపడ్డది నుదురు బొప్పికట్టడంతో గట్టిగా ఏడ్వసాగింది

"ఛీ! ముదనష్టపుదానా! బారసాలనాడు మీ నాన్నకి గుండెనొప్పి తెచ్చావు - ఈ రోజు బడికివెళ్ళబోయి, తండ్రినే పోగొట్టుకొన్నావు ఇంకా ఏం ఒరిగిపోయిందనే ఏడుస్తున్నావు ముందు నోర్మూయ్" అని కేకలెయ్యడంతో రమ్య బిక్కచచ్చిపోయి ఏడపు నాపుకోవడానికి ప్రయత్నించసాగింది

"మన ఖర్మకి పసిదాన్ని నిందిస్తావెందుకమ్మా! అదేం కావాలని చేసిందా! పట్టుమనిపదేళ్ళయినాలేని పసిబిడ్డ, తండ్రి ప్రాణాలుతీసిందని తిడుతున్నావు. అసలా పిల్లకి ప్రాణమంటే ఏమిటో తెలుసా! అన్నెంపున్నెం ఎరుగని పసిదానిమీద నీ కోపం చూపిస్తావా" అని రమ్యను ఒడిలోనికి తీసుకొని ఓదార్చసాగాడు రామారావు.

'అదికాదన్నయ్యా! ఇది ఇది పుట్టినప్పటి నుండి నష్టజాతకురాలే" అంది ఏడుపు గొంతతో!

"ఆ విషయాన్నే మరచిపోమంటున్నాను నీ పిల్లలకి నీకు ఏ లోటు రాకుండా చూసుకోవడానికి నేనింకా బ్రతికే ఉన్నానమ్మా."

"చూసిపోదామని వచ్చి, నీ నెత్తిపెద ఇన్ని బాధ్యతలు వేసుకుంటున్నావు నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేనన్నయా" అంది కృతజ్ఞతగా సావిత్రి

"ఒక్కగానొక్క చెల్లెల్ని దిక్కులేనిదానిలాగ వదిలివేసే దౌర్భాగ్యుడు కాదమ్మా నీ అన్నయ్య నాకు మాత్రం నువ్వు తప్ప ఇంకెవరున్నారు? కట్టుకున్న భార్యని కన్నబిడ్డని పోగొట్టుకున్న దురదృష్టవంతుడిని చిన్నప్పటినుండి నిన్ను కళ్ళల్లో పెట్టుకొని పెంచాను నీ కళ్ళల్లో కన్నీరు చూడలేనమ్మా!" అన్నాడు డగ్గుత్తితో!

అలా తను ఐదుగురు బిడ్డలతోనూ అన్నయ్య దగ్గరికి వెళ్ళిపోయింది

* * *

అన్నయ్య చేసేది గుమాస్తా ఉద్యోగమే అయినా, మమ్మల్ని ఏ లోటూ రాకుండా చూసుకుందేవాడు అన్నయ్యలంతా స్కూలుకి వెళ్తుంటే, తను స్కూలుకి వెళ్తానని అల్లరిపెట్టేది రమ్య కానీ తనే వారించేది ఆడపిల్లవి నీకు చదువెందుకు అని విసుక్కునేది

రమ్య తనమాటవినకుండా అన్నయ్య దగ్గరికి వెళ్ళి "మామయ్యా! మరేం నేను బడికి వెళ్ళకూడదా!" అని ప్రశ్నించేది.

"ఎందుకు వెళ్ళకూడదు?"

"నేను అన్నయ్యలాగా బడికి వెళ్తే, చెడ్డదానై పోతానట! చెప్పిన మాట వినదట! నేను బుద్ధిగా చదువుకొంటాను.

అమ్మ చెప్పిన మాటలన్నీ వింటాను. మరేఁ నన్ను బడికి పంపమని అమ్మతో చెప్పవూఁ" అని అడిగేది

ఆ చిన్నారి బుగ్గల్ని ముద్దులతో నింపి "నువ్వు తప్పకుండా చదువుకుందువు గాని" అని ఓదార్చేవాడు అన్నయ్య

అన్నయ్య దాన్ని బడిలో చేర్పించాడు చిన్నపిల్ల అవడంతో అన్నయ్యకి రమ్య అంటే ఎక్కువ ముద్దుగా ఉండేది కానీ తనకి మాత్రం ఆదొక దౌర్భాగ్యరాలిలా, తండ్రిని మింగేసిన నష్టజాతకురాలిలా కనిపించేది

"అమ్మా! అన్నయ్యలకి అన్నీ మంచి బట్టలే కుట్టి[illegible]నావు ఒక్క సిల్కు పరికిణీ కుట్టించమంటే కుట్టించవు" అంది రమ్య ఒకరోజు నిష్టూరంగా!

"ఇలాంటి వెధవ బుద్ధులన్నీ నీకు ఎక్కడ అబ్బుతున్నాయి? అందుకే అసలు నిన్ను స్కూలుకి పంపనన్నాను అతి తెలివితేటలు పెరుగుతున్నాయి గాని, పెట్టిందితిని ఇచ్చిందికట్టుకో! చిన్నప్పుడే కన్నతండ్రిని పొట్టన బెట్టుకున్నావు ఇంకా ఏ సరదాలు ఎవరు తీరుస్తారు? ఇదీ మీ మామయ్య పుణ్యమా అని ఇలా బ్రతుకుతున్నాం " అని తల వాచేటట్లు చివాట్లు పెట్టింది.

రమ్య ఏమీ అనలేక మౌనంగా ఏడ్చేది.

పెద్దవాడు కిష్టమని పెరుగుగారెలు, చిన్నవాడి కిష్టమని సేమ్యా పాయసం అడిగినప్పుడల్లా చేసిపెట్టేది రమ్య కిష్టమైన బంగాళదుంప బజ్జీలు చెయ్యమంటే "అడదానివి ఇష్టాఇష్టాలేమిటి? అన్నిటికి అన్నయ్యలతో సమానంగా వాటాలేస్తావు పెట్టింది తిని నోరు మూసుకొని ఊరుకో!" అని కసురుకునేది

రమ్య ముఖం చిన్నబుచ్చుకొని వెళ్ళిపోయేది కొడుకులందరికి గడ్డపెరుగు వేసి అన్నం పెట్టేది రమ్యకి మాత్రం నీళ్ళమజ్జిగ పోసేది అదేమని అడిగితే రమ్యని కొట్టేది రమ్యకి జ్వరం వచ్చినా తాను పట్టించుకునేది కాదు అన్నయ్య అన్నీ చూసుకొనేవాడు

ఆ ఇంట్లో రమ్యకి తల్లిప్రేమ, ఆదరణ కరువయ్యాయి కన్నతల్లే సవితి తల్లిలాగ ప్రవర్తించేది తన మూలంగానే తండ్రి చచ్చిపోయాడని సావిత్రి ఎన్నోసార్లు అంటుంటే రమ్య నిశ్శబ్దంగా తనలో తనే కుమిలిపోయేది.

అప్పటికి రమేష్ చదువు పూర్తయింది తనకున్న కొద్దిపాటి పలుకుబడితో రమేష్‌కి ఉద్యోగం వేయించాడు అన్నయ్య.

అలా ఓ రెండేళ్ళు గడిచిపోయాయి. కిరణ్ చదువుకూడా పూర్తయింది.కిరణ్‌కి కూడా ఉద్యోగం వచ్చింది అంత వరకు ఓపిక పట్టిన రమేష్, ఇంక ఆగలేనన్నట్లు ఎవరికీ చెప్పకుండా పెళ్ళి చేసేసుకున్నాడు. ఏనాడూ చేతన మాటకి

ఎదురు చెప్పని రమేష్ ఇంతపని చేసా డంటే మొదట నమ్మలేక పోయింది తనని కాదని తనని, ఈ ఇంటిని వదలి, రమేష్ రాధతో వెళ్ళిపోయినప్పుడు తను మౌనంగా ఏడ్చింది పెద్దకొడుకు రమేష్ ఈ ఇంటిని తనని ఉద్ధరిస్తాడని ఎన్నో కలలు కన్నది కానీ తన నమ్మకాన్ని వమ్ము చేసి తన గుండెలమీద తన్ని వెళ్ళి పోతున్న కొడుకుని ఏమీ అనలేక పోయింది

గోరుచుట్టుమీద రోకటి పోటన్నట్లు ఆ సంవత్సరమే అన్నయ్య ఈ లోకాన్ని వదలి వెళ్ళిపోయాడు తనకి భవిష్యత్తు అగమ్యగోచరంగా కనిపించింది రమ్య చదువు ఏడో క్లాసులో ఆగిపోయింది. ఆడపిల్లని చదివించే బదులు కొడుకుల్ని చదివిస్తే ఉద్ధరిస్తారని రత్నాకర్‌ని, నిరంజన్‌ని ఎంతో కష్టపడి చదివించింది

ఇంట్లో కోడలు ఉంటే తనకి చెయ్యి సాయంగా ఉంటుందని, కిరణ్‌కి పెళ్ళి చేసేసింది. కోడలు సుమ ఏ పనీ చేసేది కాదు ఏమన్నా అంటే, మీ కూతురు ఇంట్లో గోళ్ళుగిల్లుకొని కూర్చోకపోతే, కాస్త పనీపాట చెయ్యకూడదూ?" అని ఎదురుప్రశ్న వేసేది.

కోడలిని ఏమీ అనలేక, తను కూడా రమ్యనే కేకలు వేసేది. ఇంటి పనంతా రమ్య చేసేది. వంట చేసేసరికే తనకి అయాసం వచ్చేసేది.

• • •

రత్నాకర్‌కి, నిరంజన్‌కి పెళ్ళిళ్ళు అయిపోయాయి ఇక మిగిలింది రమ్యే! రమ్యకి పెళ్ళి చెయ్యాలంటే పదివేలు కట్నం ఇవ్వాలి రమ్య పెళ్ళి ఒక సమస్య లాగ తయారయ్యింది

రమేష్ ఇంట్లోంచి వెళ్ళిపోయాడు గానీ ముగ్గురు అన్నదమ్ములు కలిసి ఉన్నందుకు తను ఒక విధంగా సంతో షించేది ముగ్గురు కోడళ్ళు మహిళా మండలులని, మీటింగులని తిరుగుతుంటే తనేమి అనలేక పోయేది ఒకవేళ ఏమైనా అంటే "అమ్మా! అవసరమైన విషయాల్లో నివ్వెందుకు జోక్యం చేసు కొంటావు? వాళ్ళు గొప్పింటి బిడ్డలు వాళ్ళ సరదాలకి సంతోషాలకి అడ్డు చెప్పకు" అని చెప్పడంతో తను ఏమీ అనలేకపోయేది

వీళ్ళందరికీ వండి వార్చడం తన వంతైతే, వడ్డించడం, కిరణ్ పిల్లల్ని, రత్నాకర్ పిల్లల్ని ఆడించడం రమ్య డ్యూటీ అయ్యేది

ఆరోజు కిరణ్ చెప్పిన మాటలు తనింకా మరచిపోలేదు.

"అమ్మా! రమ్యకి పెళ్ళిచెయ్యకుండా ఎన్నేళ్ళు మనింట్లో అట్టేపెట్టుకుంటాము. రమ్యకి ఒక సంబంధం చూసాను"

"నీ ఇష్టప్రకారమే చెయ్యి. కానీ మనం కట్నం ఎక్కువ ఇచ్చుకోలేం కదా!" అంది కొడుకు ముఖంలోకి చూస్తూ!

"అందుకే అమ్మా! కట్నం ఖర్చలేని సంబంధం చూశాను కాకపోతే వయసు కాస్త ఎక్కువ ఉంటుంది కట్నం తక్కువలో మనకి ఎవరు దొరుకుతారు? వీళ్ళు అసలు కట్నం వద్దంటున్నారు కాకపోతే పెళ్ళికొడుక్కిది రెండో పెళ్ళి!"

"రెండో పెళ్ళా!"

"రెండో పెళ్ళైతే నేమమ్మా! అతడి కిప్పటివరకు పిల్లలు పుట్టలేదు మొదటి భార్య కేదో జబ్బుచేసి చచ్చిపోయిందట! బాగా ఆలోచించుకో అమ్మా! మన స్తోమ తుకి మించి మనం పెళ్ళి చెయ్యలేం కదా!"

తను ఏమీ ఆలోచించకుండా నీ ఇష్టమొచ్చినట్లే చెయ్యి అంది

రమ్యకి నిరాడంబరంగా పెళ్ళి జరిగి పోయింది. పద్దెనిమిదేళ్ళయినా నిండని రమ్యకి ముప్పైఐదేళ్ళ వరుడు. కాకి ముక్కుకి దొండపండులా ఉన్నాడు. రమ్య తనకి పెళ్ళి వద్దని ఏడ్చింది? కానీ తనే రమ్యని తిట్టి, భయపెట్టి ఈ పెళ్ళి జరిపించింది

రమ్య పెళ్ళి జరిగిపోవడంతో గుండెల మీద బరువు దిగినట్లనిపించింది. రమ్య లేని ఆ ఇంట్లో పనులు చేసుకోవడం కష్టంగా ఉండేది వేళకి ఎవరికి ఏది అందకపోయినా అందరూ తనమీదే విసుక్కునేవారు. రమ్యలేని లోటు అప్పుడు తనకు బాగా తెలిసింది.

ముచ్చటగా మూడేళ్ళయినా నిండక ముందే రమ్య జీవితం నాశనం అయింది. రమ్య భర్తకి బ్లడ్ కాన్సర్ ఆ జబ్బు తోనే అతడు కన్నుమూశాడు కళకళ లాడుతూ లక్ష్మీదేవిలా తిరిగే రమ్య పసుపుకుంకాలని పోగొట్టుకొని వైధవ్యాన్ని అనుభవించడానికి సంసిద్ధురాలైంది

రమ్య జీవితం నాశనం అవడానికి కారణం తనే అనిపించసాగింది నాకి పెళ్ళివద్దు అని ఏడుస్తున్న రమ్య రూపమే కళ్ళముందు కనబడేది. ఒక్కగానొక్క ఆడపిల్లకి ఘనంగా పెళ్ళిచెయ్యవలసింది పోయి, రెండో పెళ్ళివాడికి కట్టబెడతానంటే, తనేమీ జవాబు చెప్పలేకపోయింది ఎలాగో ఒక లాగ రమ్య పెళ్ళి జరిగిపోతే చాలను కుంది కానీ రమ్య జీవితం ఇలా అయి పోతుందనుకోలేదు.

అందరికీ సేవలు చెయ్యడానికి రమ్యని తీసుకువచ్చేశాడు కిరణ్.

రమ్య ఉసురు ఊరికినే పోలేదు. అదే తన పాలిట శాపంలా పరిగణించింది. రమ్య ఇంటికి తిరిగివచ్చేసిన కొద్దిరోజులకే తనకి పక్షవాతం వచ్చి మంచాన పడ్డది. కొడుకులు, కోడళ్ళు అందరూ ఛీదరించుకుంటున్నా రమ్య మాత్రం తనకి సేవలు చేస్తుంది.

చిన్నప్పటినుండి రమ్యకి తనేం చేసింది? తను ఒకవిధంగా రమ్య

జీవితాన్ని నాశనంచేసిన పాపాత్మురాలు. కానీ రమ్య ఇదంతా తన నుదుటి వ్రాత. అని సరిపెట్టుకుంటుంది. రమ్యమీద తను చూపించిన అసహ్యానికి ప్రతీకారంగా తనకి సేవలు చేస్తుంది

ఆడపిల్ల అని పుట్టినదగ్గరనుండి చులకనగా చూశాను కానీ ఈ రోజు ఆడపిల్లే లేకపోతే, తన బ్రతుకు ఏమయ్యేది? నలుగురు కొడుకులు, కోడళ్ళు ఉన్నారు. ఒక్కరైనా తన దగ్గరకి రాగలుగుతున్నారా! తనంటే అందరికీ చిరాకే! ఆఖరికి మనవలు కూడా తన దగ్గరకి రారు తనని చూసి జడుసుకుంటారు

"రమ్యా! నీకు తీరని ద్రోహం చేశానమ్మా! ఇటు నీకు మంచి చదువూ చెప్పించక, అటు తగిన వరుణ్ణి ఇచ్చి పెళ్ళిచెయ్యక నీ బ్రతుకు నరకం చేశానమ్మా! కనీసం నీకు చదువన్నా చెప్పిస్తే మవ్విలా బానిసబ్రతుకు బ్రతకకుండా, హాయిగా ఉద్యోగం చేసుకొని బ్రతికే దానివి" అస్పష్టంగా తనలో తనే అనుకుంది సావిత్రి

పశ్చాత్తాపంతో నిండిన ఆమె మనసు దుఃఖంతో ఆర్ద్రమైంది దుఃఖోద్వేగం అధికమై వెక్కిళ్ళ సన్నగా ఆమె కంఠం నుండి వెలువడుతున్నాయి

వర్షపుజల్లు హెచ్చుగా వస్తోంది. ముడుచుకొని పడుకున్న రమ్య చటుక్కున కళ్ళుతెరిచి చూసింది

తల్లి మంచంవైపు జల్లు కొట్టడం గమనించి గబగబా కిటికీ తలుపులు వేసి చలికి వణుకుతున్న సావిత్రి ఒంటిమీద దుప్పటి కప్పబోయి, తల్లి కంట్లో కన్నీరు చూసి "అమ్మా! ఎందు కేడుస్తున్నావు? బాధగా ఉందా?" ఆత్రంగా అడిగింది

ఔనన్నట్లు తలవూపి, దగ్గరకు రమ్మన్నట్లు పిలిచింది కుడిచేత్తో రమ్య చేతిని తన చేతిలోకి తీసుకొని ముద్దు పెట్టుకుంది

"ఆడపిల్లవైనందుకు నిన్ను ఈసడించుకున్నాను అసహ్యించుకున్నాను. ఎన్నోసార్లు నీ మీద చెయ్యి చేసుకున్నాను ఆఖరికి నీ భవిష్యత్తు నాశనం చేశాను నన్ను న న్ను క్షమిం చ మ్మా" ఆవేదనగా అని శాశ్వతంగా కళ్ళు మూసింది సావిత్రి